# ఏకాంతసేవ

★

శ్రీ కె. సభా

భగవాన్ !

ఏకాంతంగా కొన్ని క్షణాలు కూచుని నిన్ను ధ్యానించే సదవకాశాన్ని ప్రసాదించినందుకు నీకు ధన్యవాదములు సమర్పించుకొంటున్నాను. అనుక్షణమూ ఎందరెందరో భక్తులు స్తుతిస్తున్న ఈ ప్రపంచంలో ఏ మారుమూలలనుండియో విన్పించే నా స్వరాన్ని నువ్వు వింటున్నావు. అప్పుడే పుట్టిన పసి నిసుగుపై తల్లికుండే మమకారమే నీకు నాపట్ల ఉండక తప్పదు. ఎందుకంటావా ! నేనూ ఇప్పుడిప్పుడే నీ కోసం వెతుకుతున్నాను. భక్తి భావనోద్వేగం ఇటీవలనుండే నాలోని రక్తనాళాలలో ప్రవేశిస్తున్నది.

భగవాన్ !

నేనే చనిపోయానో—, నువ్వు నన్ను చంపావో—, తెలుసుకోగల విచక్షణాశక్తి నాకు లేదు. నాలో వస్తున్న ఈ మార్పును చూచినపుడు ఏదో అవ్యక్తానుభూతితో హృదయము పొంగిపోతున్నది. నువ్వు లేవని ఊరూరా ఉపన్యాసాలిచ్చిన రోజులు—, అంతా అబద్ధమని వెలువడే పత్రికల్లో విరివిగా ప్రచారంచేసిన దినాలు జ్ఞప్తికి వచ్చినపుడు నాలో ఆనాడు పురులు విచ్చుకొని నృత్యంచేసిన అహంకారము—, పడగలు విప్పి విషాన్ని వెదజల్లిన విద్వేషము—, ఒక్కొక్కటిగా స్మృతిపథంలో కన్పించి మరుగౌతున్నవి. ఆనాటి నేను చనిపోయాను. ఈనాడు క్రొత్తగా జన్మించాను. జీవితంలో చచ్చీ బ్రతకడం అనేది ఇదే అనుకొంటాను.

సరాసరి నీ వద్దకు సూటిగా నడిచివచ్చే మార్గం ఎంతో స్పష్టంగా కనిపిస్తున్నా—అలా నడవడానికి పాదాలు తహతహలాడుతున్నా—, హృదయం శరవేగంతో కొట్టుకొంటున్నా మనస్సు మొండిగా వ్యవహరిస్తున్న విషాద ఘట్టాలు స్ఫుటంగా కనిపిస్తున్నవి.

భగవాన్ !

నాయకులు— మేధావులు— మహాకవులు—సంపాదకులు—ప్రచురణకర్తలు—ఉన్నతాధికారులు వీరంతా నిర్మించే ఆనకట్టలను దాటుకొని సాహిత్యంతో స్వానుభవంతో నీ సాక్షాత్కార సిద్ధికై అల్లల్లాడిపోతున్న ఈ జీవన స్రవంతి నీ ప్రేమసాగరంలో విలీనమయ్యే దెన్నడు ప్రభూ !

ఉద్యోగాలూ—, సన్మానాలూ —పూలదండలు — ప్రశంసలు — ఆవిష్కరణలు అంకితాలనే ముళ్లకంచెలకు దూరంగా నాగజెముళ్లను తప్పుకొంటూ సూటిగా నీవైపు నడిచిరాగల శక్తినీ—ఆత్మ స్థైర్యాన్నీ, గుండె నిబ్బరాన్నీ ప్రసాదించమని నిన్ను కోరినపుడు నువ్వెంతో ఆదరంతో అభిమానంతో అందుకనువైన పరిస్థితులను కల్పిస్తున్నావు కానీ—,

అధర్మాన్నీ—, అన్యాయాన్నీ—, ఘోర పాపాలనూ—, విశృంఖలంగా విహరించే అవినీతినీ చూచీ—సహించీ— మౌనంగా ఉండగల ఓర్మిని మాత్రం ప్రసాదించలేకపోతున్నావు.

భగవాన్ !

సత్యాన్ని చెప్పడానికీ—చెబితే వినడానికీ—, వాస్తవాన్ని వ్రాయడానికీ—, వ్రాస్తే ప్రచురించడానికీ—, ప్రచురిస్తే చదివి ఆగ్రహోదగ్రులు కాకుండా ఉండడానికీ వీలుకాని ఈ ప్రపంచంలో ఎట్లా జీవించాలో—, ఏవిధంగా బ్రతకాలో తెలియక, తెలిసినవారూ కన్పించక, నిన్నిట్లా ఏకాంతంగా కూచుని అడుగుతున్నాను.

త్యాగరాజెంత పిచ్చివాడు ! నీ కోసమే పలవరించాడు. గానంలో, రాగంలో—తాళంలో—పల్లవిలో—, అనుపల్లవిలో—సాహిత్యంలో— ప్రత్యక్షరంలో నిన్నే సాక్షాత్కరించుకొన్నాడు.

రామదాసెంత అమాయకుడు ! ప్రజల సొమ్ము నీదే అనుకొన్నాడు. నీ కోసమే వెచ్చించాడు. నిన్ను తన వశం చేసుకొన్నాడు.

అలాంటి మహాత్ములు పుట్టిన నా దేశంలో, పోతనవంటి మహానుభావు లుదయించిన నా భూమిలో, ఈనాడు కవులు కవీశ్వరులు మహాకవులు—, గానంలో రాగంలో—, పల్లవిలో అనుపల్లవిలో–గేయంలో–కావ్యంలో–, ప్రతి రచనలో మంత్రులను సాక్షాత్కరించుకొంటున్నారు. అంకితాలు—ఆవిష్కరణలు–ఆ వెనుక తతంగాలు—పదవులూ—ఉద్యోగాలు.

రామదాసు ప్రజల సొమ్ము నీదే అనుకొంటే ఈ రామ రాజ్యంలో ప్రజా ప్రతినిధి అనుకొంటున్నవాడు ప్రజల సొమ్ము నాదే అనుకొంటున్నాడు. ఆ వెర్రి రామదాసు నీకు గుడీ గోపురం నగా నట్రా వాహనాది సౌకర్యములు కల్గించాడు.

ఈ తెలివిగల ప్రతినిధి తనకు మేడ — తోటా — దొడ్డీ — తన బంధుమిత్ర పరివారాలకు ఆస్తిపాస్తులా అన్నీ సమకూర్చుకొంటున్నాడు.

అంతా నీ లీల కాకుంటే ఏమనాలి ? ఆ రామదాసును కారాగారంలో పెట్టించావు ! ప్రజల సొమ్ము నిట్లా నాకోసమైనా సరే వెచ్చించరాదని ఆగ్రహించి అట్లా చేయించావు. ఈనాటి దాసులను ఎట్లా సత్కరిస్తావో ప్రభూ ! వీరికంతా నీ దేవలోకంలో మళ్లీ ఎన్నికలు పెట్టించవుగదా !

### భగవాన్ !

నీకు నైవేద్యం యివ్వాలనే సాంప్రదాయం ఉన్నది. ఇంట్లో పూజలో కాస్త చక్కెర నైవేద్యం అవసరమైంది. ఈనాడా చక్కెర కూడా అరుదైపోయినది ప్రభూ ! ఇహానికీ పరానికీ ఎంత తేడా ! స్వర్గంలో చక్కెర కరువుండ దనుకొంటాను. బహుశా అక్కడ కులాలు కూడా లేవని నా నమ్మకము. అసలు నువ్వేకులం వాడివో ఎవడూ చెప్పలేడు. అన్ని కులాల నేమిటీ—అన్ని ప్రాణాలనూ నువ్వు సమానంగా చూచుకొంటావు. లేకుంటే నువ్వూ నీ కుటుంబం ఎట్లా మనగలుగుతారబ్బా ! నీ వాహనం నందీశ్వరుడైతే మా అమ్మ వాహనం సింహమైపోయే ! ఎద్దుకూ సింహానికీ ఎంత చెలిమి ప్రభూ !

అమ్మగారి ఒడిలో విఘ్నేశ్వరుడు. ఆయనగారి వాహనం మూషికం. నీ మెడనిండుకూ నాగులే. ఈ నాగరాజులకు మూషికానికి ఎంత స్నేహం స్వామీ ! కాగా సుబ్రహ్మణ్యస్వామి వాహనం మయూరమైతే ఆ మయూరాన్ని చూచి ఈ నాగేంద్రులు భయపడరేం—,

మహాప్రభో నీ కుటుంబానికంటే సోషలిస్టు వ్యవస్థ ఎక్కడుంది ? నువ్వు కేపిటలిస్టు సృష్టించుకొన్న దేవు డంటారు కామ్రేడ్ ఎర్రయ్య.

### భగవాన్ !

చచ్చిపోయిన ఒక సూక్ష్మాతి సూక్ష్మమైన చలిచీమనైనా బ్రతికించే యోగ్యతలేని సైంటిస్టు శూన్యాన్ని ఆక్రమించి నక్షత్రాలను అధిగమించి ఆవెనుక ఏదో చెయ్యాలని ఆకసానికి ఎగబడి ప్రాకిపోతున్నాడు. తన్ను తాను తెలుసుకోలేని మానవుడు, తాను చచ్చిపోవడం అక్షరాలా సత్యమని ఎరుగలేని మానవుడు, ఎన్నో విపరీతమైన చర్యలతో లోకాన్ని బాధించడం ఆరంభించాడు. శోకానలాన్ని సృష్టించడానికి కృషి చేస్తున్నాడు.

ప్రతి రాజకీయవేత్తా, ప్రతి పార్టీ ప్రజలకోసమే, ప్రజాసేవకే నంటూ ప్రజల్ని బాగా ఉతికేస్తున్నారు. పరమేశ్వరా ! నీ ఉనికి ఎక్కడో ఈ మంత్రులకు తెలియకపోబట్టే సరిపోయింది గానీ, తెలిసే గనుక ఉంటే ఈపాటికి అసలు ఎన్నికలే జరుగరాదనీ—, మాకు మృత్యువే సంప్రాప్తించరాదనీ—, లెక్కలేనన్ని వరాలకోసం నిన్ను వేధించి బాధించి ఉండేవారు.

### భగవాన్ !

మాటలో — పాటలో — గాలిలో — వెలుగులో — సర్వత్రా వ్యాపించిన నిన్ను చూడాలనే ఆకాంక్ష కంటే—, నిన్ను కలుసుకోవాలనే తపన కంటే—, నీ మూర్తిత్వాన్ని హృదయపీఠంలో సుస్థిరంగా నిలుపుకోవలె ననే ఆశయం కంటె, రాజకీయ నాయకుల పరిచయభాగ్యమే బ్రహ్మానంద మనుకొంటున్న కవులకూ—, గాయకులకూ — పోతన అందగలడా ! త్యాగయ్య అర్థం కాగలడా ! వాల్మీకి స్థానానికీ—, వ్యాసుని పీఠానికీ—, నేటి కవి జీవితానికీ ఉన్న అఖాతం ఎంత పెద్దది ! ఎంత లోతైనది !

నీడవలె నన్ను వెన్నంటుతున్న నువ్వు నా దినచర్యను చూస్తున్నావు. నీకు తెలియకుండా నేనేమీ చెయ్యలేను. మనస్సు తప్పుదారిలో ఆలోచించినపుడు హృదయంలో నున్న నీ స్వరం విన్పిస్తున్నది. క్రమక్రమంగా నువ్విట్లా నన్ను బంధించావో—, లేక నేనే ఏదో ఉన్మాదంతో నీ బంధానికి చిక్కిపోయానో చెప్పలేను గానీ—, ఒకానొక మిత్రుడు నా పరిస్థితిని బానిస ప్రవృత్తిగా అభివర్ణించాడు.

ఎవరెవరికి బానిసలు ! అసలు బానిసత్వమంటే అర్థమేమిటి ? స్వేచ్ఛగా మాట్లాడే వీలులేని—, వ్రాసే అవకాశం లేని—, సత్యాన్ని చాటే అదృష్టంలేని నియంతృత్వ దేశాలలోని నా సోదరకవులు బానిసలా ? పదవులకో—ఉద్యోగాలకో—, మరే స్వార్థాలకో — పార్టీలకు — కులాలకూ — గ్రూపులకూ లొంగిపోతున్న నా మాతృదేశంలోని ప్రఖ్యాతి వహించిన కొందరో — లేక చాలమందియో కవీశ్వరులు బానిసలా ? ఏదీ పట్టించుకోక అజ్ఞాతంలో ఉన్నా, స్వాతంత్ర్య వాయువుల్ని పీలుస్తున్న పోతన, వేమన వంటి మహాకవుల కోవకు చెందినవారు బానిసలా !

భగవంతుని ఆరాధించడమే బానిసప్రవృత్తియైతే—, సత్యాన్ని లిఖించడమే బానిస ప్రవృత్తి యైతే—,

అహంకారాన్ని—నియంతృత్వాన్నీ—దోపిడీతనాన్నీ— అధికార వ్యామోహాన్ని —ఆరాధిస్తూ—, వాటికి నివాళు లెత్తుతూ వందిమాగధులై సాహిత్యపరమావధిని విస్మరించి, కవిత్వ

తత్త్వాన్ని మఱచి కేవలం పిడికెడు మెతుకులకై తమ్ము తామే మఱచిన మహాకవుల ప్రవృత్తి యెట్టిదో గదా !

భగవాన్ !

ఇదొక ఎడారి ! ఇక్కడ కార్చే కన్నీటికి విలువలేదు. ఇదొక అరణ్యం. ఇక్కడి విలాపానికి ఫలితంలేదు. ధర్మాన్నీ— న్యాయాన్నీ —సత్యాన్నీ—నీతినీ చాటే శక్తి స్తోమతులున్న సాహిత్యవేత్తలు —, కవులు—, సంపాదకులు—, రచయితలు—, అందరూ కాక పోయినా, చాలమంది తమ నిజస్వరూపాలను—తమ బాధ్యతలను విస్మరించారంటే ఎవ్వరూ పట్టించుకోరు. ఈ కంఠశోషను విన గలవాడివి—సానుభూతితో ఈ విలాపాన్ని ఆలకించగలవాడివి నువ్వు మాత్రమే.

భగవాన్ !

జీవితంలో ఎన్ని అపూర్వమైన అనుభవములను ప్రసా దిస్తున్నావు! కవులలో ఎన్ని తరగతులు ! రచయితలలో ఎన్ని వర్గాలు !! సారస్వతనందనంలో ఎన్ని సర్పాలు !!!

కులాల సాహిత్యం

మతాల సాహిత్యం

పార్టీల సాహిత్యం

పార్టీలలో గ్రూపుల సాహిత్యం

ప్రభుత్వ సాహిత్యం

ప్రతిపక్షాల సాహిత్యం

బహుమతుల కోసం సాహిత్యం—

సాహిత్యంకోసం బహుమతులు—

సాహిత్యంలో ఖూనీలు— అపరాధాలు— నేరాలు— పరిశోధనలు—

కులాలవారి సన్మానాలు

పార్టీలవారి సన్మానాలు.

వ్యావహారికవాదులు కొందరు—

గ్రాంథికవాదులు కొందరు.

మొత్తంమీద ఆంధ్ర సారస్వత నందనంలో ఫలాల నుండి నవరసాలకు మారు నీరసాలు చిందుతున్నవి.

దేశంలో అన్ని రంగాలతోపాటు సాహిత్యరంగాన్ని కూడా ప్రభుత్వం జాతీయంచేసివేస్తున్నది. కొన్నాళ్లిలాగే జరిగితే ఆధ్యాత్మికరంగాన్ని కూడా ఈ ప్రభుత్వం జాతీయం చేసి ఊరు కొంటుంది. అప్పు డిట్లా ఏకాంతంగా నీ ముందు కూచుని నా కష్టసుఖాలు చెప్పుకోలేను. నిన్ను గురించి ఎట్లా పాడాలో ఎట్లా వ్రాయాలో—? విద్యాశాఖామంత్రి ఎవరిచేతనైనా వ్రాయించుకొన్న ఉపన్యాసాన్ని ఎక్కడో బహిరంగ సభలో స్పష్టంగా స్పెల్లింగ్ మిస్టేక్స్ లేకుండా చదివితే ఏ కీచు గొంతో ముద్దుముద్దుగా ఆ వార్తలను ఆకాశవాణిలో ప్రసారం చేస్తుంది.

ఇట్లా చివరికి మనస్సులపైన—హృదయాలపైనా— భావాలపైనా—పరోక్షంగా పడుతున్న బానిసముద్రలు చీకటి దయ్యాలై ఆంధ్రసాహిత్య ప్రపంచంలో దోబూచులాడు తున్నపుడు రాత్రుల్లో సరిగ్గా నిద్ర పట్టడంలేదు !

"కాటుక కంటినీరు" పద్యం జ్ఞాపకానికి వస్తే "లావొ క్కింతయు లేదు ..... అంటూ హృద్గీతి వినిపించినపుడు నియం తృత్వదేశాలలోవలె .... ఈ దేశంనుండి కూడా స్వేచ్ఛగా బ్రతుక లేని సాహిత్యవేత్తల వలన యీ దశాబ్దంలోనే ఆరంభ మవు తుందా అనే అనుమానం కలిగి హృదయం కంపిస్తుంది. ఏదో చెప్పాలని పెదవి విప్పితే అనంతకోటి సత్యాలు అనర్గళంగా నయాగరా వలె ప్రవహిస్తాయి. ఏదో వ్రాయాలనుకొంటే సెల యేటివలె అక్షర పంక్తులు నృత్యాలు చేస్తూ శివతాండవాన్ని స్ఫురింపజేస్తాయి. అంతా నీ లీలలు గాక మరేమిటి భగవాన్ !

---

అక్కడ వేణుగాన జనితాంగజ రాగవిమోహచిత్తవై

చొక్కెడు గోపకామినులఁ జూచి హసించి దయార్ద్రదృష్టి పే

రక్కున గారవించి పరమార్థ మొసంగిన చిన్ననాటి నీ

చక్కదనంబుఁ జూడ మనసైనది చూపుము నందనందనా !

—నందనందన శతకము.